# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఆగష్టు 2022

వెల : రూ. 5.00



జూన్ 17 నుండి 23 వరకు గుండుగొలను శ్రీ కాళీవనాశ్రమం శాఖ వారు నిర్వహించిన సత్సంగ మరియు అఖండ హరేరామ నామ సంకీర్తన సప్తాహ దృశ్యములు.



అఖండ హరేరామ నామ సంకీర్తన ప్రారంభము



శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ దర్శనము



శివాలయ దర్శనము

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 41 సంచిక 12

పేజీలు 44

ఆగస్ట్ 2022

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 7

అగస్త్య హృదయం ....................... ..............9

శ్రీదండి స్వామి బోధ. ........................11

దేవహూతి ..................................................13

ఆశ్రమ స్వర్ణోత్సవ వివరాలు......................15

పెదనిండ్రకొలను మరియు హైదరాబాద్ కార్యక్రమాలు ..................... ...................16

ప్రార్థన ..........................................................17

కూర్మ పృష్ఠ జయిష్ణు ప్రపదాన్వితా.......18

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ....................20

నిస్వార్థ భక్తి ..............................................21

ఖాతా ......................................... ...................25

కైవల్యోపనిషత్ ... .......................................26

నిరాడంబరత .............................................28

శ్రావణ శోభ ..................................................30

శ్రీ మాతా కళావతీ దేవి.............................33

వివేక చూడామణి ................. ..................35

నిరీక్షణ .........................................................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ............................ ....................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

25) చక్కెరమాని వేము దినజాలినకైవడి మానవాధముల్
పెక్కురు బక్కదైవముల వేమఱుగొల్చెదరట్లు కాదయా
మ్రొక్కిన నీకు మ్రొక్కవలె మోక్షమొసంగిన నీవ యీవలెం
దక్కిన మాటలేమిటికి దాశరథీ! కరుణాపయోనిధీ!



భావం - హీనులనేకులు నిన్ను విడిచి ఇంకొకరిని గొలిచెదరు. అనగా తియ్యని చక్కెరను తినలేక చేదు వస్తువగు వేపను తినుటకు నేర్చినట్లున్నది. మ్రొక్క దగినవాడవు నీవే, మోక్షదాయకుడవు నీవే! దాశరథీ! కరుణాపయోనిధీ!

*సాధకుడు ప్రకృతిని ఎలా స్వీకరించాలి?
*నారాయణుడు ఏ రాక్షసుడికి రక్షకుడుగా వున్నాడు?
*శ్రవణం ఎప్పుడు సఫలీకృతం అవుతుంది?
*తపస్సు అంటే ఏమిటి?
*ఈశ్వర పుత్రుడు, గురు పుత్రుడు అంటే ఎవరు?
*దేని స్వభావంతో జగత్తు అంతా నడుస్తోంది?
*తన వివాహ క్రతువులో ఏ పని చేయడానికి శివుడు సందేహించాడు?
*ఉత్తమమైన ఆరాధన ఏది?
*లాయరుగారికి కాళ్ళ నొప్పులు ఎందుకు వచ్చాయి?
*శ్రీకాళీ వనాశ్రమము ఏ తెలుగు సంవత్సరంలో ప్రారంభించబడినది?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

# శ్రీ బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - కీ.శే. పరాశర ప్రసాద్

వారంతా తాము ఏదో ఘనకార్యం సాధించినట్లుగా భావించి, కరణంగారింటికి వచ్చారు. అక్కడ ఊరి పెద్దలంతా ఉన్నారు. నేను కూడా లోపల వారితో సంభాషణ జరుపుతున్నాను. మా సంభాషణ రాత్రి 12 గం॥ వరకు కొనసాగిందని చెప్పాను కదా!



వారు నన్ను అక్కడ చూసి ఆశ్చర్యపోయారు. మేము కొద్దిగంటల పూర్వమే శ్రీబాబూజీని మాంసాహార భోజనశాలకి తీసుకు వెళ్ళాము. భోజనం అయిన తర్వాత బస్సు ఎక్కించి వచ్చాము అన్నారు.

ఊరి పెద్దలంతా ఆ పిల్లల్ని మందలించారు. వారందరికి అసలు విషయం అవగాహన అయింది. అది శ్రీబాబుగారి చిద్విలాసం.

శ్రీబాబూజీ ఇంకా మాట్లాడుతూ, 'ఎనమదుర్రులో ఇటువంటి సంఘటన జరిగింది' అని చెప్పారు. ఎనమదుర్రులో ఆజానుబాహుడైన ఒక పోకిరివాడు ఉండేవాడు. వాడంటే అందరికీ భయం.

నేను ఒకరోజు ఎనమదుర్రులో ఉండగా వాడి ఇంటి ఎదురుగా ఉన్న రోడ్డు మీదగా వెళ్తున్నాను. నన్ను చూసినవారు ఎవరైన సాధారణంగా ఆఊరిలో లేచి నిలబడటమో, లేక లోపలికి వెళ్ళటమో జరిగేది. కాని ఆ పోకిరివాడు మాత్రం వరండాలో కుర్చీలో పడుకుని ఒక గ్లాసుతో నీళ్ళు నోటిలో పోసుకుని సరిగా నేను వచ్చే సమయంలో రోడ్డు మీదకు ఉమ్మి వేశాడు.

నావెంట చాలామంది జనం ఉన్నారు. వారంతా కలిసి వాడికి తగిన బుద్ధి చెపుతామన్నారు. కాని నేను వారిని వారించాను. 'అతనిని ఏమీ అనకండి పాపం అనారోగ్యంగా ఉందేమో' అని అన్నాను.

తిరిగి సాయంత్రం అదే విధంగా ప్రవర్తించాడు. వాడు తప్పని సరిగా కావాలని తుంటరితనంగా ప్రవర్తించినట్లు రూఢి అయింది.

నావెంట ఉన్న భక్తులు నా మాట కాదనలేక వాడికి తగిన బుద్ధి చెప్పలేకపోయారు.

నేను నా వెంట ఉన్న భక్తులకి చెప్పాను. మీరంతా రెండురోజులు ఆగండి. వాడి సంగతి మీకే తెలుస్తుంది. వాడి అహంకారమే వాడికి తగిన బుద్ధి చెపుతుంది. మహాత్ములను దూషించినా, వారి ఎడల అసభ్యంగా ప్రవర్తించినా, ఊరకనే పోతుందా? తెల్లవారగానే వాడికి రక్తవిరేచనాలు, వాంతులు. ఒక్కరోజులో వాడి పని అయిపోయింది. డాక్టర్లు వాడి దగ్గర ఎంత వసూలు చేయాలో అంత చేశారుగాని, వ్యాధి మాత్రం నయం కాలేదు. వాడు చేసుకున్న కర్మ ఎవరు తప్పించగలరు? ఒక్క పరమాత్ముడు మినహా!

అతని భార్య వచ్చి ఆ ఊరి పెద్దలను కలిసి తన భర్తని రక్షించమని అర్థించింది. పెద్దలంతా 'నీ భర్త జీవించటం కష్టం అతను రక్షింపబడాలంటే ఒకటే మార్గం, అతను శ్రీబాబూజీని అవమానించాడు. కాబట్టి ఆ పాపకర్మ అనుభవిస్తున్నాడు. శ్రీబాబూజీని ప్రాధేయపడి రక్షించమని వేడుకోండి. ఆయన ప్రేమ స్వరూపుడు తప్పక రక్షిస్తారు' అని చెప్పారు.

రోజూ శ్రీ బాబూజీ ఆ రోడ్డు మీదనే వెళ్ళేవారు. ఆ మరునాడు ఉదయము శ్రీబాబుజీ ఆ రోడ్డుమీద వెళ్ళే టైము చూసుకుని ఆ తుంటరివాడు లేచి నిలుచొని శ్రీ బాబూజీకి నమస్కరించి 'స్వామీ! నన్ను క్షమించండి నేను పొరబాటు చేశాను!' అనిన వెంటనే, శ్రీబాబుజీ కరుణకి పాత్రుడయ్యాడు.శ్రీబాబూజీ అతని భార్యను పిలిచి, మజ్జిగ తీసుకురమ్మని, దానిని అతనికి అందజేశారు. సాయంత్రానికల్లా అతను తేరుకున్నాడు విచిత్రంగా. ఇలా ఉన్నాయి బాల్యంలో నాలీలలు. ఇంకా చాలా చేశానులే అవన్నీ ఎందుకూ" అన్నారు శ్రీబాబు.

ఇంతలో లాయరుగారు 'బాబూ! నాకు కాళ్ళు నొప్పులుగా వున్నాయండి' అన్నారు. శ్రీబాబూజీ సమాధానం చెపుతూ "బాబు స్మరణ తగ్గి, క్లయింట్ల మీదకి, వాళ్ళ ధనంమీదకి, దృష్టి పోయింది. అందువలననే అలా జరిగి ఉంటుంది" అన్నారు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

***దేనిని ఆశించాలి?***

భగవంతుడు మనకి అత్యంతమైన ఆత్మానుభూతిని అనుభవించడానికి పవిత్రమైన మానవదేహాన్ని ప్రసాదించాడు. అంతేకాకుండా ఈ విశాల ప్రపంచంలో మనని ఎక్కడో వదిలివేయకుండా, సద్గురుదేవులు పరమమైన అనుగ్రహంతో తమ దరికి చేర్చుకున్నారు మనల్ని. మనం ఏది సాధించాలనుకున్నా ఈ దేహం వుండగానే సాధించాలి. కానీ, నువ్వు మానసిక దౌర్బల్యంతో ఇంకా ఏదో వుంది, ఏదో చేయాలి అని ప్రపంచం వెమ్మటే పరుగులు పెడుతూ, మహాత్ములను చిన్నచూపు చూసి, పెడచెవిని పెడుతున్నావు.



బ్రహ్మపదార్థాన్ని అనుభవించడానికి ముందుకు వెడుతున్నామా? తెలిసి కూడా వెనక్కి త్రోయబడుతున్నామా? అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. నీవు వెనక్కి వెడుతున్నావు అనడం లేదు సుమా! నీ మానసిక స్థితిని బట్టి నీవు వెనక్కి త్రోయబడుతున్నావు. మరి నీ మనస్సును దాటి ముందుకు వెళ్ళాలంటే ఏం చేయాలి? దానికి కూడా ఆ భగవంతుడే ఉపాయం చెప్పాడు. **దైవీ హ్యేషా గుణమయీ। మమ మాయా దురత్యయా। మామేవ యే ప్రపద్యంతే। మాయామేతాం తరంతితే॥** (గీత 7/14)

అలౌకిక సామర్థ్యంగల త్రిగుణాత్మకమైన నా యొక్క దైవీ మాయను దాటడం చాలా కష్టమైనది. కానీ, ఎవరైతే నన్నే శరణు పొందుతారో వారు ఈ మాయను దాటగలుగుతారు. - అని శ్రీకృష్ణ భగవానుడు శెలవిచ్చాడు.

ఈ మాయను గురించి ఇంకా చెబుతూ శ్రీ గురుదేవులు తమ భక్తులయిన శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్‌వారి చేత ఒక చక్కని కీర్తనను అందించారు. మాయ అనేది ఎన్ని విధాలుగా మనపై పడవచ్చో, దానిని దాటే విధానమేమిటో అన్నీ ఈ కీర్తనలో చెప్పబడ్డాయి.

ఎంతో గొప్పది నీ మాయ
అది రానీయకు నా ఛాయ
దానిని దాటాలంటే నీ దయ
మరి వేరే మార్గం లేనేలేదయా!

1. దారాపుత్రులు, బంధు మిత్రులు
దాని బలగమే లేవయ్యా!
ధన ధాన్యాలు, ఘన బిరుదాలు
దాని గారడీ లేవయ్యా ॥ఎంతో॥

2. తెలియకపోవట మొక మాయ
తెలుసనుకోవుట పెనుమాయ
తెలిసీ తెలియని అయోమయంలో
తికమక పడటం మహామాయ ॥ఎంతో॥

3. ఇన్ని తికమకలు లేవయ్యా
ఉన్నది నీ వొక్కడేనయ్యా
నువ్వంటే నేనయ్యా
నేనంటే నువ్వేనయ్యా ॥ఎంతో॥

ఇది అచ్చ తెలుగులోనే వుంది. ఇక వేరే అర్థం చెప్పుకోవలసిన పనేముంది? అయినా మాతాజీ ఎప్పుడు చూసినా ఈ పాటే పాడతారేమిటి? అని మీలో చాలా మంది అనుకుంటున్నారు కదూ! అవును, నిజమే మరి ఎన్ని సార్లు పాడుకున్నా, ఎన్ని సార్లు విన్నా పరగడుపే అయిపోతోంది కదా! అదే మాయ మరి! అందుకనే దానిని గురించి మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటుంటే ఈ సంసారంలోనే వుంటూ, దానిని గుర్తిస్తూ, దానిబారిని పడకుండా ఎలా రక్షించబడాలో తెలుస్తుంది.

ఈ మాయ యొక్క స్వభావంతోనే ఈ జగత్తు అంతా నడుస్తోంది. అలాగని ఈ జగత్తుని విడిచి పెట్టమని ఏ మహానుభావుడూ చెప్పలేదు. దానిలోనే వుంటూ జాగ్రత్తగా సంచరించమన్నారు. అంటే అతిగా మమకారాలు పెంచుకోవద్దన్నారు. దారా పుత్రులు, ధనధాన్యాలు, ఘన బిరుదాలు - అవి మాత్రమే మనకు కావలసినవి కావు అని గుర్తించాలి. అప్పైనా సరిగా వుండాలంటే గురువు అనుగ్రహం వుండి తీరాల్సిందే. గురుదేవుల (భగవంతుడి) అనుగ్రహంతోనే ఈ సంసారంలో మనం మునిగిపోకుండా రక్షింపబడతాం. - సశేషం

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయ అమితాత్మనే।**

**కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః ॥**

**తాత్పర్యము** - తమస్సును రూపుమాపే వాడవునూ, శీతలత్వాన్ని నశింప జేసేవాడవునూ, శత్రువులను దునుమాడి, కృతఘ్నులను నశింపజేసే వాడవునూ, సమస్త జ్యోతులకూ అధిపతివీ అయిన ఓ భాస్కరుడా! నీకు నమస్కారము.

ఈ శ్లోకము ద్వారా అగస్త్యులు గుహ్యముగా గురువు సాధకుడిని తరింపజేసే క్రమమునూ, దానికి సాధకునికి వుండవలసిన దీక్షా దక్షతలను తెలియజేస్తున్నారు.

**తమోఘ్నాయ** అన్న నామముతో **అంధకార నిరోధత్వాత్ గురురిత్యభ్యధీయతే** అని చెప్పబడినట్లు అజ్ఞానమును తొలగించే గురుపరమాత్మను వర్ణిస్తున్నారు. **ఘ్న** - తొలగించువాడు అన్న అక్షరము ద్వారా సత్యవస్తువుతో కూడి వుండి కూడా ఆవరణాది దోషములతో గుర్తించలేని సాధకుని స్థితితోపాటుగా ఆ దోషములను తొలగించే గురు శక్తినీ, అందుకు గురువులు పడే ఆరాటమునూ అగస్త్యులు తెలియ జేస్తున్నారు. శ్రీబాబూజీ మహరాజ్ ఉల్లిపాయ పొరలను ఒక్కొక్కటిగా తీసివేసినప్పుడు చివరికి తీసేవాడే మిగులుతాడన్న మహత్తరమైన అద్వైత తత్వమును ఎంతో సులభంగా అందించారు.

మరి అటువంటి ఆత్మదర్శనము చేయించగల గురువు లభ్యమైనప్పుడు సాధకుడికి వుండవలసిన అప్రమత్తతను, **హిమఘ్నాయ** అంటూ జడత్వమును దూరం చేసుకోవలసిన ఆవశ్యకతను అగస్త్యులు సూచిస్తున్నారు. ఆ జడత్వము గురుకృప వలన మాత్రమే తొలగినా దానిని తొలగించుకొనవలసిన పట్టుదల, దీక్ష సాధకుడే కలిగి వుండాలి. సాధకుడికి జడత్వము, సోమరితనము తగదని శ్రీబాబు హెచ్చరిక చేసేవారు.

**శత్రుఘ్నాయ** అన్న ప్రస్తావన ద్వారా సాధనా క్రమములో సాధకునికి వుండవలసిన ఇంద్రియ నిగ్రహము, అరిషడ్వర్గములైన కామ, క్రోధ,

లోభ, మోహ, మద, మాత్సర్యాలపై సాధించవలసిన విజయమును అగస్త్యులు గుర్తుచేస్తున్నారు. శ్రీబాబూజీ 'అరిషడ్వర్గములు ఆరింటిలో కనీసం ఒక్కటైనా నాకు సమర్పించండి తరింపజేస్తాను' అని అభయ మిచ్చారు. అలా మనందరినీ సంరక్షించి, ఉద్ధరిస్తున్న స్వామిని మనం ప్రీతితో **ఓం కామాది శత్రు విధ్వంసకరాయ నమః** అని కొలుస్తున్నాము కదా! అవధులు లేని వారి అనంతతత్వమునే **అమేయాత్మనే** అన్న నామము అభివర్ణిస్తోంది.

ప్రకృతిలో కనిపించే ప్రతి వస్తువునూ భగవత్ప్రసాదముగా సాధకుడు స్వీకరించాలి. ఆ కృతజ్ఞతా భావమే భక్తికి దారి తీస్తుంది. ఆ భావనను పెంపొందించే గురుదేవులనే **కృతఘ్నఘ్నాయ** అన్న సంబోధన సూచిస్తుంది.

తమస్సును నిర్మూలించి జ్ఞానజ్యోతిని ప్రకాశింపజేసే సద్గురు దేవులను **జ్యోతిషాం పతయే నమః** అంటూ అన్ని జ్యోతులకూ ఆధారమైన స్వరూపముగా అగస్త్యులు ఆవిష్కరిస్తున్నారు. **జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే** అని గీతాచార్యులు వివరించిన స్వరూపము అదే!

అప్రమేయమూ, స్వప్రకాశమైన జ్ఞానజ్యోతిగా గురుదేవులను ఈ శ్లోకం ద్వారా అగస్త్యులు దర్శింపజేస్తున్నారు.

శ్రీబాబూజీని మనం స్తుతించే **ఓం అప్రమేయాయ నమః ఓం స్వప్రకాశాయ నమః** అన్న నామముల వెనుక అంతరార్థము అదే కదా!

- సశేషం



# శ్రీ దండి నిర్మలానందగిరి స్వామి బోధ

సేకరణ - రమణ ప్రసాద్

శ్రీ కాళీవనాశ్రమ స్థాపన దినోత్సవం సందర్భంగా పూజ్య శ్రీ దండి నిర్మలానంద స్వామివారు చేసిన ప్రసంగం.

ఈ వైశాఖ మాసంలో శ్రీ శంకర జయంతి, బుద్ద జయంతి, శ్రీ ఆంజనేయ స్వామి జయంతి, ఈ ఆశ్రమ స్థాపన స్వర్ణోత్సవాలు కలిసి వచ్చాయి. అందువలన ఈ వైశాఖమాసం అతి పవిత్రమైన మాసం. శ్రీ శంకరులు జ్ఞానానికి ప్రతీక. బుద్ధ భగవానుడు కర్మకు ప్రతీక. ఆంజనేయుస్వామి భక్తుడు. జ్ఞానము. కర్మ, భక్తి ఈ మూడింటినీ సమన్వయం చేస్తూ ఈ ఆశ్రమ స్థాపన జరిగింది. ఈ మూడూ అవసరమే.

స్థూల శరీరానికి కఫ వాత పిత్తములనే మూడు దోషాలు ఉన్నాయి. సూక్ష్మశరీరానికి మల విక్షేప ఆవరణ దోషాలు ఉన్నాయి. బ్రహ్మ సర్వత్ర వ్యాపించి ఉన్నా, అనుభూతికి రావాలంటే, మల విక్షేప ఆవరణ దోషాలను తొలగించుకోవాలి.

ఒక అద్దం ఉంది. దానికి దుమ్ము పట్టి ఉంది. దుమ్ము తీసేస్తే అద్దం అల్లల్లాడినట్లు కనిపించింది. అది నిశ్చలం కావాలి. దాని మీద గుడ్డ కప్పబడి ఉంది. నీ ముఖం కనపడాలంటే దుమ్ము తీసివేయాలి ; అద్దం నిశ్చలంగా ఉండాలి ; అద్దం మీద కప్పిన గుడ్డ తీసివేయాలి. అలాగే మనలోని ఈ మూడు దోషాలని తొలగించుకోవాలి. మల దోషమంటే ఏమి? అనేక జన్మల సంస్కారం తోడై ఏదైతే ఉందో అది ఈ జన్మలో ఏం చేస్తుంది?

అర్జునుడు అడిగాడు శ్రీ కృష్ణుడిని,

**అథ కేన ప్రయక్తో౽ యం పాపం చరతి పూరుషః।**

**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః॥ 3/36**

అయితే మానవుడు పాపం చేయాలని కోరనప్పటికినీ దేనిచే ప్రేరేరింపబడి, పాపములు చేయుచున్నాడు?

**శ్రీ భగవానువాచ**

**కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః।**

**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥ 3/37**

రజో గుణము వలన పుట్టిన కామము. అదియే క్రోధముగ పరిణమించుచున్నది. ఆ కామము ఎంత అనుభవించినను తృప్తినొందనిదియు మహా పాపములకు కారణమైనదియు అయి ఉన్నది. పాప కర్మ తొలగాలంటే పుణ్య కర్మలు చెయ్యి. నిష్కామంగా చెయ్యి. పుణ్యం చేస్తే ఏమవుతుంది. నీ చిత్తం శుద్ధి అవుతుంది. మోక్షం రాదు. జ్ఞానం కలుగదు. "నకించిత్ కర్మ కోటిభిః" - ఎన్ని కర్మలు చేసినా ముక్తి రాదు.

అందువలన దీనికి కారణమైన అజ్ఞానాన్ని నివృత్తి చేసుకో. పుణ్య కర్మలు చేయాలంటే పురుష ప్రయత్నం ఉండాలి. ధ్యానం చేయాలంటే ప్రయత్నం చేయాలి. నీ బుద్ధి శుద్ధమయితేగాని శ్రవణం వంట పట్టదు. పాపం పోవాలంటే కర్మ చేయాలి. "కంటకం కంటకేనైవ" ముల్లుని ముల్లుతో తీసినట్లు కర్మ చేయాలి. కర్మ వలన పుణ్యం వస్తుంది. పాపం వల్ల దుఃఖం, పుణ్యం వల్ల సుఖం, జ్ఞానం వల్ల మోక్షం లభిస్తాయి.

"నేను చేస్తున్నాను" అనే భావం లేకుండా చేసేవాడే ఈశ్వర పుత్రుడు. అతడే గురు పుత్రుడు. పుతలీబాయి తన పుత్రుడైన కరం చంద్ గాంధీని, "బిచ్చగాడు వచ్చాడు భిక్ష వెయ్యి" అంటుంది. "అది సరికాదు. దరిద్ర నారాయణుడు వచ్చాడు భిక్ష వెయ్యమని చెప్పాలి" అంటాడు. గీతా పుత్రుడైన గాంధీ మహాశయుని, ''జైలులో ఎలా వుంటున్నావు?" అని అడిగితే, "గీతామాత ఒడిలో ఆనందంగా ఉన్నాను" అని సమాధానం ఇచ్చాడు.

సకామంగా చేసే కర్మల వల్ల పుణ్యం రావచ్చు. కాని చిత్తం శుద్ధి కాదు. చిత్తము శుద్ధి కావాలంటే, మలదోషం పోవాలంటే ఏం చేయాలి? నిష్కామ కర్మలు చేయాలి. "నేను చేస్తున్నాను" అనే భావం లేకుండా చేయాలి.

- సశేషం

# దేవహూతి

సేకరణ - సుధాకర్ భోగరాజు

"ఆడపిల్లలు అత్తవారిళ్ళకి వెళ్ళిపోయారు. భర్త సన్యసించి మోక్షగామియై తపోవనాలకి వెళ్ళిపోయాడు. ఇక నా గతి ఏమిటి?' అని చింతించిన దేవహూతి ఒకనాడు, ధ్యాననిష్ఠుడై వున్న కపిల మహర్షిని సమీపించింది. తల్లి రాకలోని ఆంతర్యాన్ని గ్రహించిన కపిలుడు ప్రసన్న మందహాసం చేసి" అమ్మా! నీ మనస్సులో చెలరేగుతున్న సంక్షోభాన్ని గుర్తించాను. స్వాయంభువ మనువుకి పుత్రికగా జన్మించావు. కర్దమమహర్షి వంటి ఉత్తముడిని భర్తగా పొంది లోటులేని సంసారజీవనం సాగించావు. పదిమంది సంతానానికి జన్మనిచ్చి మాతృమూర్తిగా గృహిణిగా గృహధర్మాన్ని నిర్వర్తించావు. నీలాంటి ఉత్తమ జన్మ అనునది కోటికి ఒక్కరికి వస్తుంది.

'లేదూ' అన్నది లేకుండా చక్కటి జీవితాన్ని గడిపిన నీకు యీ దిగులు దేనికమ్మా?" అని అడిగాడు. 'నాయనా! నువ్వన్నది నిజమే. నా తండ్రి స్వాయంభువ మనువు అల్లారుముద్దుగా నన్ను పెంచాడు. ఏ లేటూ లేకుండా తండ్రి నీడలో నా బాల్య జీవితం గడిచింది. అటుపై గృహస్థాశ్రమంలో నా భర్త చాటున ఏ కొరతా లేకుండా నా వైవాహిక జీవితం గడిచింది. తొమ్మిది మంది ఆడపిల్లలకి, ఒక సుపుత్రుడికి తల్లినైనందున నా గృహస్థజీవితం కూడా సంతృప్తిగా గడిచింది. నా అంతటి భాగ్యశాలి లేదనుకొని సంతోషిచాను. కానీ, నాయనా! నాకు వివాహం చేసి తన బాధ్యత తీరిందనుకున్నాడు నా తండ్రి. నన్ను సంతానవతిని చేసి, వారి వివాహాలు చేసి తన బాధ్యత తీరిందని తపోవనాలకి వెళ్ళిపోయాడు నా భర్త. వివాహాలు కాగానే భర్తల వెంట నడిచి తమ బాధ్యత తీర్చుకున్నారు నా కూతుళ్ళు. ఒక్కగానొక్కడివి, దైవాంశ సంభూతడివైన నీ పంచన నా శేషజీవితం గడపవచ్చనుకుంటే, నువ్వు పుడుతూనే యోగివై, విరాగివై, అవతార పురుషుడివై, సాంఖ్యయోగ ప్రబోధకుడివై నా ఆశల మీద నీళ్ళు చల్లావు.

నా తండ్రి, నా భర్త, కుమార్తెలు, కుమారుడు ఎవరి బాధ్యత వాళ్ళు తీర్చుకొని నన్ను ఒంటరిదాన్ని చేశారు. నన్ను కన్నందుకు నా తల్లిదండ్రులకి కన్యాదాన ఫలం దక్కింది. నన్ను వివాహమాడినందుకు

నా భర్తకి గృహస్థాశ్రమ ధర్మఫలం, కన్యాదానఫలం దక్కింది. వివాహాలైన నా కూతుళ్ళకీ, కుమారుడివైన నీకూ పితృఋణఫలం దక్కుతుంది. ఏ ఫలం, ఫలితం ఆశించకుండా బాల్య, యవ్వన, కౌమార దశలు గడిపి మీ అందరికీ సేవలు చేసిన నాకు దక్కిన ఫలం ఏమిటి నాయనా! ఇక ముందు నా గతి ఏమిటి?' అని వాపోయింది దేవహూతి గద్గద స్వరంతో.

కపిలుడు మందహాసం చేసి 'అమ్మా! నువ్వేదో భ్రాంతిలో యిలా మాట్లాడుతున్నావు. ఇలాంటి భ్రాంతికి కారణం నిరాహారం కావచ్చు. నువ్వు ఆహారం తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది కదమ్మా!' అన్నాడు. దేవహూతి విస్మయంగా కుమారుడి వైపు చూచి 'నిరాహారిగా ఉండనిచ్చావా నన్ను? నీ మాట కాదనలేక నాలుగు కదళీఫలాలు భుజించాను కదయ్యా!' అంది. 'అరటిపళ్ళు తిన్నావా? ఎక్కడివమ్మా?' ఆశ్చర్యంగా అడిగాడు కపిలుడు. దేవహూతి మరింత విస్తుబోతూ, 'అదేమిటయ్యా! మన ఆశ్రమంలో రకరకాల ఫలవృక్షాలను నాటాము. వాటికి కాసిన పండ్లని ఆరగిస్తున్నాము. ఆ ఫలవృక్షాల్లో ఏ ఋతువులో కాసే పళ్ళు ఆ ఋతువులో పండుతున్నాయి కదయ్యా!' అంది. కపిలుడు తలపంకించి 'ఓహో!ఋతుధర్మమా?' అన్నాడు. 'అవునన్నట్లు' తలవూపింది దేవహూతి.

కపిలుడు తల్లి కళ్ళలోకి చూస్తూ 'ఋతుధర్మం అంటే!' అనడిగాడు. ఆ ప్రశ్న విని నిర్ఘాంతపోయింది దేవహూతి. 'అమ్మా! ఋతువుకొక ధర్మం వుంది. అది ఏ కాలంలో ఏవి ఫలించాలో వాటిని ఫలింపజేస్తుంది. అలా ఒక్కొక్క ఋతువులో అందుకు తగ్గ ఆహారాన్ని మనకి ప్రసాదిస్తున్న ఋతువు తన ధర్మానికి ప్రతిఫలంగా మననించి ఏమాశిస్తోంది? కృతజ్ఞతగా మనం ఏమిస్తున్నాం?' అని ప్రశ్నించాడు కపిలుడు.

- సశేషం

## *శ్రీ సద్గురు స్వామి స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవ మహోత్సవములు*

**శ్రీ శ్రీ శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి  చతుస్త్రింశత్(34వ) వార్షిక పుణ్యారాధన మహోత్సవములు, శ్రీ సద్గురు విశ్వశాంతి పాశుపత వజ్రగ్రథిత మహా మృత్యుంజయ సంపుటిత రుద్రయాగము, అఖండ హరినామ సంకీర్తన,  త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళన**

ది.11.11.2022 శుక్రవారము నుండి 21.11.2022 సోమవారము వరకు

ఆహ్వానము

ఆధ్యాత్మిక జిజ్ఞాసువులారా!

శ్రీ కాళీ వనాశ్రమము (శ్రీ కాళీ గార్డెన్స్) పరీధావి నామ సంవత్సర నిజ వైశాఖబహుళ తదియ బుధవారము అనగా ది.31.05.1972న శ్రీ బాబూ విజ్ఞాన మందిర్ గృహప్రవేశముతో ప్రారంభింపబడి 50 సంవత్సరములు పూర్తి చేసుకొన్న సందర్భముగా శ్రీ శుభకృత్ నామ సంవత్సర కార్తీకబహుళ తదియ శుక్రవారమునుండి కార్తీక బహుళ ద్వాదశి (తత్కాల త్రయోదశి) సోమవారము వరకు అనగా ది.11.11.2022 నుండి 21.11.2022 వరకు శ్రీ సద్గురుదేవుల పరమానుగ్రహముతో స్వర్ణోత్సవ మహోత్సవములు, అఖండ హరినామ సంకీర్తన, పరమహంస పరివ్రాజకాచార్య పరమ పూజ్యపాద శ్రీ శ్రీ శ్రీ దండి నిర్మలానందగిరి స్వామివారి సర్వాధ్యక్షతన త్రయాహ్నిక సాధు ధర్మ సమ్మేళనము (19.11.2022 నుండి 21.11.2022) నిర్వహించు కొనుచున్నాము. ఆస్తిక మహాశయులందరూ ఈ కార్యక్రమములలో పాల్గొని, భక్తుల సేవచేసుకొని తరించగలరని ఆశించుచున్నాము.

**నిత్య కార్యక్రమములు:**

మేలుకొలుపు, సుప్రభాతం, ప్రార్థన, శ్రీ సద్గురు పాదుకా ప్రదక్షిణ, పాశుపత వజ్ర గ్రథితమహా మృత్యుంజయ  సంపుటిత రుద్రయాగము, తీర్థ ప్రసాదములు, అఖండ హరినామ సంకీర్తన, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ లక్షనామార్చాన, హోమం, దర్బారు, మహాప్రసాదం.

**కార్తీకమాసము సందర్భంగా ప్రతిరోజూ మహన్యాసపూర్వక సామూహిక  రుద్రాభిషేకములు జరుగును.**

వివరములకు...

93465 35357

93983 34345

93937 86603

ఇట్లు

కార్యనిర్వాహక వర్గము

## పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**ఆగస్ట్ 2022**

12 శుక్ర - శ్రావణ పూర్ణిమ, రాఖీ - శ్రీసద్గురుపాదపూజ.

19 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - శ్రీసద్గురుపాదపూజ.

21 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ

31 బుధ - శ్రీవినాయక చవితి - శ్రీసద్గురుపాదపూజ.

**సెప్టెంబర్ 2022**

10 శని - భాద్రపద పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ.

20 మంగళ - శ్రీగురుదశమి - శ్రీసద్గురు పాదపూజ.

26 సోమ -శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**ఆగస్ట్ 2022**

12 శుక్ర - శ్రావణ పూర్ణిమ, రాఖీ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

19 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

21 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

31 బుధ - శ్రీవినాయక చవితి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

**సెప్టెంబర్ 2022**

10 శని - భాద్రపద పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

20 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

26 సోమ -శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం.

# ప్రార్థన

ఆంగ్ల మూలం సేకరణ, అనువాదం - జగన్నాథ ప్రసాద్

నాకు శక్తిని ఇవ్వమని భగవంతుడిని కోరాను
కాని, నేను శక్తివంతుడను కావడానికి కష్టాలను ఇచ్చాడు.

తెలివిని ప్రసాదించమని అడిగాను
కాని, పరిష్కరించుకోమని సమస్యలనిచ్చాడు.

సంపదలనిమ్మని ప్రార్థించాను
కాని, కష్టబడి సంపాదించుకోమని బుద్ధినిచ్చాడు.

ధైర్యాన్ని ఇవ్వమని కోరాను
కాని, ఎదుర్కొని, జయించమని ప్రమాదాలను కల్పించాడు.

ప్రేమ కావాలని అడిగాను
కాని, సాయం చేయమని దీనులను చూపించాడు.

ఉపకారాలు కావాలని ప్రార్థించాను
కాని, అనుకూలంగా మార్చుకోమని అవకాశాలను ఇచ్చాడు.

నేను కోరినది ఏదీ భగవంతుడు ఇవ్వలేదు
కాని, నాకు అవసరమైనవన్నీ లభించాయి.

అదీ భగవంతుడి ప్రేమ, ప్రణాళిక!
'ఉచితాలు వద్దు - శ్రమించు, సంపాదించు'
జీవితాన్ని యథాతథంగా అనుభవించి, ఆనందించాలి
అదే భగవంతుడి ఆశయం, ఆశీస్సు!!

# కూర్మపృష్ఠ జయిష్ణు ప్రపదాన్వితా

-హనుమత్ జయప్రద. భాగవతుల

అమ్మవారి నామాలలో ఇది ఒకటి. ఇది అంతా కూడా ఒక్క నామము గానే చదవాలి (మధ్యలో, రెండు భాగాలుగా చెయ్యకూడదు). దీనియొక్క అర్థం తాబేటి వీపును జయించు స్వభావము గల మీగాళ్లతో కూడినది అని. అనగా అమ్మవారి మీగాళ్ళు (పాదము యొక్క పై భాగము లేదా ఉపరిభాగము అని) తాబేలు వీపుకన్న బాగా గట్టిగా ఉన్నాయి అని అర్థం.

సహజంగా మనకి వచ్చేటువంటి ఆలోచన ఏమిటి అంటే అమ్మ అంటేనే సున్నితత్వం, సుకుమారం, లాలిత్యం కదా మరి అంతటి గట్టిదైన తాబేలు చర్మంతో ఆవిడ పాదాలను పోల్చడం ఏమిటి? అని.

శ్రీ ఆది శంకర భగవత్పాదుల వారు కూడా సౌందర్యలహరిలో అదే అంటారు.

**పదం తే కీర్తీనాం ప్రపదమపదం దేవి విపదాం**

**కథం నీతం సద్భిః కఠినకమఠీకర్పరతులామ్ ?**

**కథం వా బాహుభ్యాముపయమనకాలే పురభిదా**

**యదాదాయ న్యస్తం దృషది దయమానేన మనసా ?**

ఇక్కడ అమ్మవారి పాదముల యొక్క ఉపరిభాగము (మీగాలు) అంటారు వాటిగురించి చెప్తున్నారు అమ్మా! నిన్ను ఆశ్రయించిన వారికి, సత్కీర్తులను కలిగించి, సకల ఆపదలను తొలగించేవి నీ పాదాలు. అటువంటి నీ పాదమును, నీ వివాహ వేళ, రాతియందు, వధువు పాదము పెట్టించుట అనే ఒక తంతుయందు, దయాపూర్ణమైన మనసు గల నీ భర్తయైన శివుడు, తన చేతితో, నీ పాదములు పట్టుకుని, రాతియందు వుంచడానికి ( వధువుచే సన్నికల్లు తొక్కించుట), చాల సందేహించాడు. ఎందుకనగా, అతి మృదులమైన, నీ పాదములు, ఆ కఠిన రాతి స్పర్శతో, ఎక్కడ కందిపోతాయో అని. మరి అంత సున్నితమైన ఆ సుకుమార పాదాన్ని, ఆ పాదంపై నున్న మీగాలుని (అరికాలు పై భాగం) కొందరు సత్కవులు (లలితలో వశిన్యాది దేవతలు) కఠినంగా ఉండే, తాబేలు వీపు చిప్పతో, ఉపమానం

చెబుతూ, ఎలా వర్ణించగలిగారమ్మా! అని శ్రీ ఆది శంకర భగవత్పాదుల వారు అంటారు.

తాబేలు విష్ణువు యొక్క రూప అవతారము. పురాణాలలో శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాలలో రెండవ అవతారం కూర్మావతారము.

కూర్మము అనగా తాబేలు. దేవదానవులు అమృతము కోసము పాలసముద్రాన్ని మథించడానికి మందర పర్వతాన్ని కవ్వంగా నిర్ణయించి, పాలసముద్రంలో వేస్తే అది కాస్తా ఆ బరువుకి పాలసముద్రంలో మునిగిపోతుంటే, విష్ణుమూర్తి కూర్మావతారములో దానిని భరిస్తాడు. ఇది కృతయుగంలో సంభవించిన అవతారం.

కానీ ఆ నారాయణుడి దశ అవతారాలు ఎక్కడనుండి వచ్చాయి? అమ్మ వారి యొక్క చేతి వ్రేళ్ళ గోళ్ళ నుండే కదా ? (**కరాంగుళి నఖోత్పన్న నారాయణ దశాకృతిః** (శ్రీ లలితా సహస్రనామము) అంటే అమ్మే స్వయముగా శ్రీ మహావిష్ణువు రూపము, కూర్మ రూపముతో వచ్చి తనయొక్క వీపు మీద చతుర్దశ భువనాలకు రక్షణ కల్పించింది .

తాబేలు ఒక ప్రత్యేకమైన జంతువు. మనం, టచ్ మీ నాట్ అనే మొక్కని చూసే ఉంటాం. దాని యొక్క సైంటిఫిక్ పేరు మిమోస పూడిక. ఈ మొక్క ఆకులని మనం తాకగానే తనంతట తానే ముడుచుకు పోతుంది. ఇది ఆ మొక్కకి ఉన్న లక్షణం. అదే విధంగా తాబేలు కూడా బయట తనకి హాని కలిగించేటు వంటి పరిస్థితి ఏర్పడినప్పుడు వెంటనే దాని యొక్క ఇంద్రియాలను లోపలికి ముడుచుకుని ఒక రాయి లాగ కదలకుండా అయిపోతుంది. బాహ్యేంద్రియ, అంతరేంద్రియ నిగ్రహం అనేది తాబేలు యొక్క ప్రత్యేకమైన లక్షణం.

భగవద్సాధనలో కూడా అంతరేంద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహం అనేటు వంటివి చాల ముఖ్యము అని మన గురుదేవులు వివేకచూడామణి ద్వారా శమము, దమము, ఉపరతి, తితిక్షా, శ్రద్ధ, సమాధానము (శమాదిషట్కసంపత్తి ) మోక్ష సాధనలో ముఖ్యమైనవి అని చెప్పియున్నారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**ఆగస్ట్ 2022**

5 శుక్ర - వరలక్ష్మీ వ్రతం

12 శుక్ర-శ్రావణ పూర్ణిమ - రాఖీ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

19 శుక్ర - శ్రీకృష్ణాష్టమి - కలశ స్థాపన, శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన భక్తసమారాధన, రాత్రి 7గం. శ్రీసద్గురు పాదపూజ

20 శని - ఉదయం 11గం.లకు సామూహిక శ్రీరాధాకృష్ణ సహస్ర నామార్చన, భక్త సమారాధన.

21 ఆది - శ్రీగురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

25 గురు - మాస శివరాత్రి

27 శని - అమావాస్య

31 బుధ - వినాయకచవితి - తె.జా 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, ఉదయం 11గం. సామూహిక వినాయకవ్రత పూజలు, భక్తసమారాధన.

**సెప్టెంబర్ 2022**

5 సోమ - ఉపాధ్యాయ దినోత్సవం

10 శని - భాద్రపద పూర్ణిమ- ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం - శ్రీసద్గురు పాదపూజ

20 మంగళ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

24 శని - మాస శివరాత్రి

25 ఆది - అమావాస్య.

26 సోమ - శ్రీ శరన్నవరాత్రి మహోత్సవ ప్రారంభం. ఉదయం అంకురార్పణ.


నిస్వార్థ భక్తి
మధువ
రుక్మిణీ మాతా! ఎందుకు మీరంతా ఇలా విచారంగా ఉన్నారు?
నారద మహర్షీ! మా స్వామి విపరీతమైన తలనొప్పితో బాధపడుతున్నారు. ఎందరు వైద్యులు చూసినా ఏమీ ఉపయోగం లేకపోయింది.
1
ప్రభూ! తమ బాధా నివారణకు ఉపాయం తమరే శెలవివ్వాలి.
నారదా! ఎవరైనా భక్తుల పాదధూళి నా శిరస్సున ధరించడమే దీనికి ఏకైక ఉపాయం.
2


తల్లులూ! విన్నారు కదా! మీరెవరైనా మీ పాదధూళి స్వామి శిరస్సున ఉంచి ఆయనకు బాధా నివారణ చెయ్యండి.
అమ్మో! పతిదేవుని శిరస్సుపై మా పాదధూళా? అపచారం! అపచారం!
3


అయినా మహర్షీ! తమరే స్వామికి పరమ భక్తులు కదా! తమ పాదధూళినే ఉపయోగించవచ్చు కదా!
ఎంత మాట తల్లీ! స్వామి పాదాలు ఈ భృత్యుని శిరస్సున దాలుస్తారు కానీ, నా పాదధూళి ఆయన శిరస్సునా? ఆ ఆలోచనే మహాపాపం.
4


ఏమైంది మహర్షీ! ఎందుకలా ఉన్నారు?
ఓ గోపికలారా! కృష్ణ పరమాత్మ విపరీతమైన తలనొప్పితో బాధ పడుతున్నారు! ఎన్ని వైద్యాలు చేసినా తగ్గట్లేదు.
5


అయ్యో! మరి దీనికి ఉపాయమే లేదా మహర్షీ!
ఉంది తల్లీ! ఎవరైనా భక్తుల పాదధూళి స్వామి శిరస్సున దాలిస్తే తగ్గుతుందిట. కానీ అది మహా పాపమని అందరూ వెనుకాడుతున్నారు.
6


అయ్యో! ఇంత చిన్న విషయం కోసం మా కృష్ణయ్యను అంత బాధ పెడుతున్నారా? మాకు ఎంతటి మహాపాపం అంటుకున్నా పరవాలేదు. మేము నరకానికి పోవటానికైనా సిద్ధమే కానీ మా కృష్ణయ్య బాధ చూడలేము. ఇదిగో మా అందరి పాదధూళి వెంటనే తీసుకెళ్లండి.
ఆ!!!
7


చూశావా నారదా! గోపికలది ఎంతటి నిస్వార్థమైన భక్తి? తమ ప్రభువు బాధా ఉపశమనం కోసం తాము ఎంతటి నరకాన్నయినా అనుభవించడానికి సిద్ధపడ్డారు.
అవును ప్రభూ! అందుకే గోపికలను మించిన భక్తులు ఈ ప్రపంచంలోనే లేరు.
8

# ఖాతా

(గత సంచిక తరువాయి)

సేకరణ - ఎన్. కాళీప్రసాద్

ఆ క్షణంలో ముకుళిత హస్తాలతో మీరు చెప్పిన మాటలు నా జీవితానికి స్ఫూర్తిగా నిలిచాయి. "నా నియమం, నా సూత్రం ఏమిటంటే, కష్టంలో ఉన్న వ్యక్తికి చేసే సహాయానికి ప్రతిఫలంగా నేను ఏమీ తీసుకోను. నా భగవంతుడే నేను చేసిన పనికి సంబంధించిన లెక్కను చూస్తాడు", అని మీరు అన్నారు. నామమాత్రపు ఆదాయం ఉన్న వ్యక్తి ఇంత ఉన్నతమైన ఆలోచనలు, విలువలు కలిగి ఉండి, ఎంతో దృఢ సంకల్పంతో వాటిని అనుసరించగలిగినప్పుడు, నేను ఎందుకు చేయలేను అని ఆ రోజు అనుకున్నాను. అప్పటి నుండి, నా జీవితంలో కూడా అలాగే ఉండాలని సంకల్పించుకున్నాను. నాలుగు సంవత్సరాలు గడిచాయి, నాకు ఎప్పుడూ దేనికి కొరత లేదు. నిజానికి, నేను గతంలో కంటే చాలా ఎక్కువ పొందుతున్నాను. ఈ ఆసుపత్రి నాది. మీరు ఇక్కడ నా అతిథి, మీ స్వంత నియమం, మీ సూత్రం ప్రకారంగా కూడా నేను మీ నుండి డబ్బు తీసుకోలేను.

ఆ భగవంతుడి దయ వల్ల మీలాంటి స్ఫూర్తిదాయకమైన వ్యక్తికి సేవ చేసే అవకాశం నాకు కలిగింది. ఆ సర్వశక్తిమంతుడు మీ మంచి పనుల జాబితా లెక్కను ఉంచుకున్నాడు, ఈ రోజు మీ భగవంతుడు ఆ లెక్కను చెల్లించాడు. నేను చేసిన పనుల ఖాతా కూడా ఆయన వద్ద ఉంచుకుంటాడు, నాకు అవసరమైనప్పుడు, దాని నుండి ఖచ్చితంగా ఆయనే సరిచేస్తారు. మీరు హాయిగా ఇంటికి వెళ్ళండి, ఏ సమస్య వచ్చినా మీరు సంకోచం లేకుండా నా దగ్గరకు రావచ్చు" అని డాక్టర్ ఆ వ్యక్తితో చెప్పాడు. ఆ వ్యక్తి  క్యాబిన్ నుండి బయటికి వెళుతూండగా, గదిలో వుంచిన భగవంతుని బొమ్మను చూడగానే, చేతులు వాటంతటవే పైకి లేచి నమస్కరించగా, అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతని హృదయం అపారమైన ప్రేమతో నిండిపోయింది! మనం చేసిన పనులు వడ్డీతో సహా తిరిగి మన వద్దకే వస్తాయి. ఇది ఈ విశ్వం యొక్క నియమం! ఈ ప్రపంచపు ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడమే ఉత్తమమైన త్యాగం. అదే ఉత్తమ ఆరాధన. ఇలా ప్రవర్తించేవాడు కర్మ బంధనం నుండి విముక్తి పొందుతాడు.

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

మనం ప్రపంచంలో వుంటున్నాము. ఏదో ఒక విషయం లేదా సంఘటన ద్వారా నిస్ప ృహ కలుగుతుంది. మనస్సు అశాంతికి గురవుతుంది. అప్పుడు దైవ ధ్యానం చేసి, మనస్సు ఆ దైవంతో ఏకీకృతమైతేనే మనలోని అశాంతి రహితమవుతుంది. నిశ్చలంగా వుంటుంది. ఈ శాంతికి ఎవరు కారణం? ఎవరైనా బయట నుండి వచ్చి అశాంతిని రహితం చేశారా? లేదు. మనలో నుండే వచ్చింది శాంతి. **ధ్యానం నిర్విషయం మనః** అని మరొక ఉపనిషత్తులో తెలిపారు. మనస్సు ఇక్కడికి (సత్సంగానికి) వచ్చి కూర్చున్నా, ఇంతకు ముందు జరిగిన అశాంతిని తెచ్చిపెట్టే విషయాల గురించే ఆలోచిస్తూ వుంటే ఇక ఏమిటి లాభం? వైరాగ్యం, వివేక దృష్టి, విచారణ ద్వారా ఎవరికి వారే శాంతి పొందాలి. ఎవరికి ఆకలివేస్తే వారు తింటేనే కడుపు నిండుతుంది గానీ, వేరొకరు తింటే ఆకలి తీరదు. ఆత్మజ్ఞానం విచారణ ద్వారా లభ్యమవుతుంది. ధ్యానం, సంకీర్తన కన్నా కూడా విచారణ చాలా గొప్పది. ఎందుకంటే తనని తాను గురించిన విషయం **తత్ త్వమేవ; త్వమేవ తత్** గుర్తించగలుగుతున్నాము. ఈ ఉపనిషత్తులోని 23వ మంత్రాన్ని శ్రీ మాతాజీ ఇలా వివరించారు.....

'నాకు' (ఆత్మకు) భూమి, నీరు, అగ్ని, ఆకాశము, వాయువు ఏదీ లేదు. కళంకం లేనివాడను నిష్కళంకుడు, అద్వితీయుడను రెండవది లేదు, సర్వసాక్షిని (సమస్తమునకు), సదసద్రహితుడను, (సత్తు అసత్తు కాని దానిని) పరమాత్మ స్వరూపము నెరిగి, ఆ శుద్ధమగు పరమాత్మ స్వరూపమునే పొందుచున్నాడు.

ఈ పంచమహాభూతములు పరమాత్మ నుండి వచ్చి ఆ పరమాత్మలోనే ప్రకాశిస్తున్నాయి. కానీ పరమాత్మకు ఇవన్నీ లేవు. అవన్నీ నేను కాదు అని ధృవీకరించడం కోసం ఈ మంత్రంలోకూడా ముందు మాదిరిగానే అశ్వలాయన మహర్షికి బ్రహ్మదేవుడు వివరించాడు.

సర్వసృష్టికి కారణం పంచమహాభూతాలు. వాటి నుండి మిగతా పంచీకరణం అంతా కూడా జరిగింది. ఇవేమీ కూడా పరమాత్మలో

లేవు. 'నేను' పరమాత్మ అద్వితీయుడను. సర్వసాక్షిని. దేనికీ అంటను. కానీ అన్నింటికీ ఆధారం నేనే. ఉదాహరణకు మట్టితో కుండలు, బొమ్మలు అనేకం తయారు చేయవచ్చు. అవన్నీ నశించిపోవచ్చు. కానీ అవన్నీ వుండటానికి ఆధారం మట్టియే. అలాగే అలలకి ఆధారం సముద్రం. ఆభరణాలకు ఆధారం బంగారం. అలాగే మనందరికీ ఆధారం ఆత్మయే. ఆత్మ ఉపాదాన కారణం. రూపాలు నిమిత్త కారణాలు.

శ్రద్ధాళువైన విద్యార్థి యొక్క బుద్ధిలో వుదయించే సందేహ నివృత్తి చేయడం కోసం నాకు అంటే పరమాత్మకు భూమి, నీరు, ఆకాశం, అగ్ని, వాయువు ఏమీ లేవు అనే వాక్యం చెప్పవలసి వచ్చింది. గురువు యెడల వుండే భక్తి శ్రద్ధల వలన అంతరికంగా అటువంటి అతీతానుభూతి సాధ్యం కాగలదు అని శిష్యుడు అనుకోవచ్చు. కానీ సామాన్యంగా మానవుడుకి ఆంతరంగిక అనుభూతి కంటే ప్రపంచంలో విషయానుభూతి విశేషించి ప్రత్యేకంగా వుంటుంది. తనలోని మనస్సును నశింపజేసుకోవచ్చు కానీ పంచమహాభూతాలను, వాటి రూపాలను నాశనం చేయలేడు. నిశ్చల ధ్యాన సమయంలో తనలో తానుండి ఆ దివ్యమైన ప్రపంచాతీతమైన అనుభూతిని పొందవచ్చు. బయట స్థూల ప్రపంచం కనిపిస్తున్నప్పటికీ అతని భ్రమను తొలగించడానికి గురువు పంచమహాభూతాలు అక్కడ లేవు అని చెబుతున్నాడు.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఆగస్ట్ 2022 :*** AS 7516, 7563-7574, 8033, 8341, 8820, 8821, 8822, 8826, 8829, 8831, 8833, 8834, 8836, 8839, 8840, 8842-8845, 8848-8854, 8856-8859. LM 4343, 4345, 4349, 4352.

***సెప్టెంబర్ 2022 :*** AS 6912, 7577, 7580, 7581, 7591, 7850, 8860-8867, 8876. LM 4356, 4358. •

## నిరాడంబరత

- పాలూరి కాళీప్రసాద్

ఆగస్టు నెల వచ్చిందంటే చిన్న పిల్లలనుండి వృద్ధులవరకు ప్రతి వారికి ఇష్టమైన ఇద్దరు దేవుళ్ళ పండుగలు వస్తాయి. అవే కృష్ణాష్టమి, వినాయక చవితి. శ్రీకృష్ణుడు, వినాయకుడు ఈ ఇద్దరినీ ఇష్టపడని వారు ఉండరు. దాదాపుగా మిగిలిన పండుగలు అన్నింటికీ ఏ దేవాలయానికో వెళ్ళి దర్శనం చేసుకోవటంతో సరిపెడతారు కానీ ఈ రెండు పండుగలు మాత్రం ప్రతివారు తమ ఇంట్లో చేసుకుంటారు. వయస్సుతో, హోదాతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ తమ స్వంతమైన దేవుళ్ళు వీరిద్దరూ.

అవతరించిన నాటినుండి వరుసగా ఎన్నెన్నో హత్యా యత్నాలను ఎదుర్కొని, చివరికి జగద్గురువుగా ఎదిగినవాడు శ్రీకృష్ణ పరమాత్మ. అలాగే ప్రాణం పోసుకొన్న కొద్ది సేపటికే శిరస్సును కోల్పోయి విగతజీవుడైనా తిరిగి మరొక శిరస్సును పొంది, ప్రథమపూజ్యుడయిన వాడు, విఘ్నాధిపతి అయినవాడు వినాయకుడు. పత్రమైనా, పుష్పమైనా, ఫలమైనా, చివరికి ఇన్ని నీళ్లయినా భక్తితో సమర్పిస్తే ప్రీతితో స్వీకరిస్తానని ప్రకటించాడు శ్రీకృష్ణుడు. ఇదే విషయాన్ని ప్రతి సంవత్సరం మనకు ప్రత్యక్ష నిదర్శనంగా చూపిస్తున్నాడు వినాయకుడు.

నిజానికి ఒకప్పుడు వినాయక చవితి పూజలు ఎవరింట్లో వారు వారి వారి స్తోమతకు తగినట్లుగా చేసుకొనేవారు. వ్రతకథలో కూడా "తమ తమ విభవము కొలది గణేశుని పూజించార"ని ఉంటుంది. అయితే స్వాతంత్రోద్యమ కాలంలో పరాయి పాలకుల న్యాయ సూత్రాలను ఉల్లంఘించకుండానే, ప్రజలందరిని ఒకచోట సంఘటిత పరచి స్వాతంత్ర్య స్ఫూర్తి రగుల్కొల్పటానికై తిలక్ మహాశయులు సామూహిక గణపతి పూజలను ఒక సాధనంగా ఎంచుకొన్నారు. అయితే ఇటీవలి కాలంలో ఈ భక్తి గతి తప్పి ఒకరికంటే ఇంకొకరు భారీగా పూజ చేయాలనే పోటీతో బలవంతంగా చందాలు వసూలు చేయటం, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ రోడ్లమీద పూజలు చేయటం, విపరీతమైన ధ్వని కాలుష్యం, ఇంకా పూజ పందిళ్ళలో, ఊరేగింపులో అశ్లీల పాటలు, నృత్యాల వంటివి ఎక్కువయ్యాయి.

భక్తి వేరు, ఆడంబరం వేరు. రెండిటికి పొసగదు. తాము మహారాజులమని అహంకారంతో పెద్దపెద్ద దేవాలయాలను నిర్మించి ఆర్భాటంగా ప్రతిష్ఠాది కార్యక్రమాలను నిర్వహించ తలపెట్టిన వారిని నిరాకరించి, తమ చిన్న కుటీరంలో మనసునే ఆలయంగా మలచుకొని మట్టి పూలతోనే పూజించిన భక్తులను అనుగ్రహించిన ఉదంతాలు ప్రతి దేవుని చరిత్రలోనూ మనకు కనిపిస్తాయి. భక్తిలో నిరాడంబరత మాత్రమే కాదు, నిస్వార్థత కూడా ఉండాలి. 'భగవంతుడు అందరివాడు. ఆ అందరిలో నేను కూడా ఒకడిని' అని భావించేవాడు ఆయన అనుగ్రహాన్ని పొందుతాడు. ఆయన నాకు మాత్రమే స్వంతం అనుకునేవాడు ఆయనను దక్కించుకోలేడు. సత్యభామ శ్రీకృష్ణుడు నాకు మాత్రమే దక్కాలి అని పట్టుబట్టి చివరికి ఎంతటి కష్టాలకు, అవమానాలకు గురైందో మనకు తెలిసినదే కదా! అలాగే వినాయకోత్పత్తికి, ఆయన గజముఖానికి మూల కారకుడయిన గజాసురుడు పరమేశ్వరుడు నాకు మాత్రమే స్వంతం కావాలనుకొని చివరికి అకాల మరణం పాలయ్యాడు. అయితే తరువాత వీరిద్దరూ, వారి అచంచల భక్తి ద్వారా ఉద్ధరింపబడ్డారు.

ఇక గజాసుర సంహారం తరువాత ఒక విచిత్ర విషయం జరిగింది. "దుష్టాత్ములకు ఇట్టి వరములు ఈయరాదు. ఇచ్చినచో పాముకు పాలు పోసినట్లగును" అని రోజంతా పాము మీద పడుకొనే ఒక దేవుడు తన ఒళ్లంతా పాములను ధరించే మరొక దేవునికి హితబోధ చేస్తాడు. ఇది చూడటానికి విచిత్రంగానే అనిపించినా, భగవంతుని నిష్పాక్షికతకు ఒక నిదర్శనం. "ఎటువంటి భయము, పక్షపాతము లేకుండా ప్రజలందరిని సమానంగా సేవించుకుంటానని" ఉత్తుత్తి ప్రమాణాలు చేసే నాయకులను ఎందరినో మనం చూసి ఉన్నాం. కానీ ఏ ప్రమాణమూ చేయకపోయినా సృష్టిలోని ప్రతి ప్రాణిని సమభావనతో చూస్తూ, అది తమకు కష్టకారకమని తెలిసినా కూడా వారి వారి కర్మలను అనుసరించి వారికి ఫలాలను అందించే ఉదాత్తమైన స్వభావం పరమాత్మునిది. ఇది మనందరికీ కూడా అనుసరణీయం.

**(తరువాయి భాగం 34వ పేజీలో.................................)**

## **శ్రావణ శోభ**

- సుషుమ్నా ప్రసాద

మన హైందవ సాంప్రదాయంలో శ్రావణమాసమునకు చాలా ప్రాధాన్యమున్నది. ఇది చాలా పవిత్రమైన మాసము. శుభప్రదమైనది. శుభకార్యాలు ఎక్కువగా ఈ మాసంలోనే జరుగుతాయి. ఈ మాసం కళ్యాణాలకు నిలయం కాబట్టి ఇది కళ్యాణప్రదమైనది. మహిళలకు మహిమాన్వితమైన, మంగళప్రదమైన మాసము ఈ శ్రావణమాసం. సువాసినులు అందరూ మంగళగౌరీవ్రతమును (శ్రావణమంగళ వారములందు), వైభవోపేతమైన వరలక్ష్మీ వ్రతం (శ్రావణ శుక్రవారం) ఈ మాసంలోనే జరుపుకుంటారు. పడతులు పసుపు పారాణీలతో, పట్టు వస్త్రాలు ధరించి, పరమానందంతో పర్వదినాలు జరుపుకుంటారు. ప్రతి ఇంతి పూబంతి లాగా శ్రావణ శోభతో వెలుగొందుతుంది.

ఈ శ్రావణమాసం ఆధ్యాత్మికంగా కూడా ఎంతో పవిత్రమైనది. మానవునికి, కాలానికి అవినాభావ సంబంధం వుంది. కాలమనేది కేవలం భగవత్స్వరూపం. కాలమునకు ఆద్యంతాలు లేవు. అది నిత్యసత్యము. అందుచేతనే గీతాచార్యుడు గీతలో **కాలం కలయతామహం** అని స్పష్టం చేశారు. మానవ జీవితం జననమరణాలనే వలయంలో చిక్కుకుని వున్నది. కాలము అనేది ఒక అనంత ప్రవాహం. మానవుడు ఆ కాలానికి బంధితుడు. కానీ, కాలం సద్వినియోగం చేసుకుంటే అతడు కాలాతీతుడు కాగలడు. మానవుడు మాధవుడుగా రూపొందుతాడు. అలాంటి కాలాతీతులు మనకెంతోమంది వున్నారు. సాధరణంగా మనం విశిష్ఠవ్యక్తుల చరిత్ర పునశ్చరణ చేసుకొనేటప్పుడు మనం ఫలానా వ్యక్తి ఏ యుగానికి చెందినవారో, వారి సమకాలికులెవరో స్ఫురణకు తెచ్చుకుంటాము. ఉదాహరణకు అవతార పురుషులైన శ్రీరామచంద్రుడు త్రేతాయుగానికి చెందినవాడు, శ్రీకృష్ణపరమాత్మ ద్వాపరయుగానికి చెందినవాడు. కలియుగానికి కూడా వన్నెతెచ్చినది ఆ యుగపురుషులు అవతారమూర్తులే కదా! అలాగే జగద్గురు శంకరాచార్యులు, శ్రీరామానుజాచార్యులు, శ్రీమాన్ మధ్వాచార్యులు, శ్రీరామకృష్ణ పరమహంస, వివేకానంద మొదలగువారందరూ ఏ యుగానికి, ఏ కాలానికి చెందినవారైనా వారందరూ కాలాతీతులు, చిరంజీవులు,

చిరస్మరణీయులు. అలాంటి మహాత్ములకు నిలయం భారతావని రత్నగర్భ. మహనీయులు కాలాన్ని మహిమాన్వితము చేస్తారు. అలా మహిమాన్విత మైన కాలమే మంగళప్రదము, శుభప్రదము.

అలాంటి శుభప్రదమాసమే శ్రావణమాసము. ఈ మాసమునకు ఎంతో ఆధ్యాత్మిక ప్రతిపత్తి వున్నది. శ్రవణానికి అనుకూలమైనది శ్రావణ మాసము. ప్రకృతి వాతావరణం కూడా సాధనకు సానుకూలంగా చాలా దోహదం చేస్తుంది. మార్తాండుని ప్రచండ ప్రభావానికి ఆలవాలమైన వసంతఋతువు, గ్రీష్మఋతువుల తరువాత వర్షఋతువు ప్రారంభం కాగానే శ్రావణమాసం వస్తుంది. గ్రీష్మతాపం తరువాత వర్షఋతువు ప్రారంభంతో వాతావరణము ఆధ్యాత్మిక సాధనకు జపతపాదులు చేసుకోవడానికి సానుకూలంగా వుంటుంది. అందుచేతనే సర్వసంగ పరిత్యాగులైన స్వాములందరూ ఆషాఢమాసం చివరిలో చాతుర్మాస వ్రతదీక్ష ప్రారంభిస్తారు.

సంఖ్యాపరంగా పంచమ మాసమైన శ్రావణము పంచ భూతాత్మకమైన ఈ శరీరమును పంచేంద్రియాలతో నిగ్రహించడానికి ఎంతో దోహదం చేస్తుంది. పఠనము కన్నా, శ్రవణానికి ఎంతో ప్రాధాన్యం వున్నది. పఠనం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కాని శ్రవణమన్నది విద్యార్హతతో సంబంధం లేకుండా ఎవరైనా చేయగలరు. శ్రవణం, మననం, నిదిధ్యాస అన్నారు. **శ్రద్ధావాన్ లభతే జ్ఞానం** అన్నట్లుగా శ్రవణానికి కూడా శ్రద్ధ ఎంతో అవసరం. మనం శ్రద్ధగా శ్రవణం చేసినప్పుడే మననం చేయగలము. శ్రవణేంద్రియంతో శ్రద్ధగా విన్నది హృదయానికి హత్తుకు పోవాలి. అప్పుడే శ్రవణము సఫలీకృతమవుతుంది. భగవత్పరమైన శబ్ద శ్రవణము మనస్సును క్షాళనం చేసి, శుభ సంకల్పాలతో నింపాలి. అశుభ సంకల్పాలను ఈ చెవితో విని ఆ చెవితో వదిలివేయాలి. అంతేకానీ మస్తిష్కంలోకి ప్రవేశపెట్టరాదు. విష్ణునాకర్ణించు వీనులు వీనులని ప్రహ్లాదుడు చెప్పినట్లుగా వీనులను విష్ణుపరం చేయాలి. అప్పుడే మనసు విషయరహితం అవుతుంది. భగవద్భక్తులతో సాంగత్యం చేయాలి. సత్సాంగత్యము వలన కలుష రహితమైన నిర్మలమైన సుశబ్దము శ్రవణేంద్రియములో ప్రవేశించి, మననము ద్వారా మానవుని మాధవునిగా రూపొందిస్తుంది. శ్రవణం ద్వారా మననము, ఆ సద్విషయ మననము మనసును శోధించి, సంకల్ప రహితం చేస్తాయి. అప్పుడే

సదాశివ దర్శనం లభిస్తుంది.

అందుచేతనే జగన్మోహనాకారుడై జగత్తును తరింపజేసిన శ్రీకృష్ణపరమాత్మ శ్రావణమాసములోనే అవతరించాడు. శ్రావణమాసము గోకులానికి గోవిందుడనే అపూర్వ వరాన్ని ప్రసాదించింది. సుశబ్దమై శోభించే మహత్తరమైన కృష్ణనామము గోపాలురను, గోపికామణులను సుసంపన్నం చేసింది. కృష్ణ శబ్దము వారిని కల్మష రహితులను చేసి, నిర్మలమైన మనసుతో నీరజాక్షుని సేవించి, తరించారు. శ్రవణం చేస్తే, కృష్ణ శబ్దాన్నే శ్రవణం చేయాలి. ఆ శబ్ద మహిమ నిరుపమానమైనది. మననం చేస్తే మదనగోపాలుడినే మననం చేయాలి. అజ్ఞానాన్ని రహితం చేసి ఆనందాన్ని ప్రసాదిస్తాడు. ఆద్యంతాలు లేని అమృతత్వపు స్థితిని ప్రసాదించేది కృష్ణ శబ్దము. కృష్ణస్వామి ప్రసాదించిన ఆనంద సాగరంలో పరవశించి, కృష్ణశబ్దమనే తరంగంలో పరవశించి, కృష్ణపరమాత్మను హత్తుకుపోయిన గోపాలకులు, గోపికలు వారనుభవించిన పరమానందమునకు దీటైనవారెవరు? ఆ సుసంపన్నులకు కుబేర సంపద వారి కాలిగోటికి కూడా సరిపోదు. వారి సంపదకు, శ్రావణ మాసమునకు సంబంధం వున్నది.

గీతాచార్యుడైన శ్రీకృష్ణ పరమాత్మ మానవాళికి ప్రసాదించిన మహత్తరమైన అమూల్యమైన భగవద్గీత అది ఒక మత గ్రంథం కాదు. అది గతి తప్పిన మతిని సంస్కరించి, మమతను పెంచిన మమకారమును మట్టుపెట్టి, మానవత్వమును ఆవిష్కరించే మహత్తర గ్రంథమే భగవద్గీత. అన్నిమతాలవారికి, అన్ని దేశాలవారికి అన్వయించే అమృత గ్రంథరాజము. మానవత్వంలోని నానత్వమును రహితం చేసి, మాధవునిగా మలిచేది. ఆ భగవద్గీతను శ్రావణమాసంలో శ్రద్ధగా శ్రవణం చేస్తే మానవజీవితానికి సార్థకత వస్తుంది. అలా దైనందిక పారమార్థిక జీవితాలకు పట్టుకొమ్మవంటిది భగవద్గీత. అట్టి గీతాశ్రవణము, సద్గురుబోధా శ్రవణంతో శ్రమను తొలగించి, శ్రద్ధాభక్తులను ద్విగుణీకృతం చేసి, శుభప్రదమైన శ్రావణశోభతో భక్తులను పరవశింప జేసేది ఈ శ్రావణమాసం. శ్రీకృష్ణకృపకు మహిమకు ఆలవాలమైన శ్రావణమాసమును సద్వినియోగం చేసుకుని జీవితాలను సార్థకం చేసుకోమని ప్రసాదదేవుడు మనకు ప్రభోదిస్తున్నారు!!

# శ్రీ మాతా కళావతి దేవి

సేకరణ - మురళి

(గత సంచిక తరువాయి)

శ్రీ మాతాజీ ఆధ్యాత్మిక బోధనల ద్వారా మరియు ఆమె మార్గదర్శకత్వంలో జరిగే ప్రార్థనల ద్వారా అక్కడి వారి భాష, ప్రవర్తన, ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయాయి. అంతకు పూర్వం వారు చేసే ఆరాధన బలులతో కూడి వుండేది. కాని, ఇప్పుడు వారు బలులు ఇవ్వడం పూర్తిగా మానివేశారు. వెనుకబడిన జాతుల వారిలో ఇంతటి మార్పును తీసుకు వచ్చారు శ్రీ మాతా కళావతీదేవి!!

ఆమె బోధనలలో పిడివాదం, మూర్ఖత్వం మరియు మతోన్మాదానికి చోటులేదు. అన్ని మతాలకు లక్ష్యం ఒక్కటేనని, మార్గాలు వేరని బోధించేవారు. హిందూ మహాత్ముల గురించే కాకుండా, క్రీస్తు, బుద్ధ, మహ్మదు ప్రవక్త వంటి వారి గురించి కూడా కథలు వారికి బోధిస్తూ వుండేవారు. ఒక సామాన్య వ్యక్తి తన జీవితాన్ని ఎలా ఆధ్యాత్మికంగా మలచుకోవాలో నేర్పించారు. కుటుంబం సజావుగా నడవటానికి స్త్రీ తన భర్తకు, పిల్లలకు, అత్తమామలకు అనుకూలంగా ఎలా నడచుకోవాలో బోధిస్తూ భారతీయ స్త్రీ యొక్క ఉన్నత స్థితిని తెలియజేసేవారు. పురుషులకు తమ ఇంటిలోని స్త్రీలను దేవతల ప్రతిరూపాలుగా చూసుకోవాలని చెప్పేవారు.

శ్రీ మాతాజీ స్థాపించిన 'శ్రీ హరి మందిరం' ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ కేవలం ప్రార్థనలకే ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చేవారు. మనస్సును ప్రార్థనల నుండి దూరం చేస్తాయని సమావేశాలకు వచ్చే భక్తులు పూలు, పండ్లు, ప్రసాదాల వంటివి తేవడాన్ని నిరుత్సాహపరిచేవారు. వేల కొలదీ భక్తులు వచ్చే సమయాలలో కూడా తినుబండారాలను అమ్మే దుకాణాలను పెట్టనిచ్చేవారు కాదు. ఎందుకంటే పరధ్యానంలో వున్న మనస్సు శాంతి, ఆనందం మరియు సంతృప్తిని సాధించడంలో విఫలమవుతుంది.

శ్రీ మాతాజీ క్రమశిక్షణకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చేవారు. ఎన్నివేలమంది సందర్శకులు వచ్చినా అందరూ క్రమశిక్షణతో మెలిగి తొడతొక్కిడి లేకుండా ప్రశాంతంగా కార్యక్రమంలో పాల్గొనేవారు. వారి

ఉపన్యాసాలు అన్ని వయస్సుల వారికి ఆసక్తి కలిగించేవి. స్త్రీలు, పురుషులు, బాలలు కూడా శ్రద్ధగా వినేవారు. ఉపన్యాసాలలో అందరి సమస్యలకూ పరిష్కారాలు దొరికేవి. కర్ణాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలలో అసంఖ్యాకమైన శాఖలు ఏర్పాటు చేసి, ఆశ్రయించినవారికి మంత్రోపదేశం చేస్తూ, ఎంతమందిని ఉద్ధరించారో చెప్పనలవి కాదు. దీన జనోద్ధరణ గావించి శ్రీ మాతా కళావతీదేవి 1978 ఫిబ్రవరి 8న శ్రీ సద్గురుసాయుజ్యం పొందారు.

---

(నిరాడంబరత తరువాయి భాగం 29వ పేజీ నుండి..................)

ఇక ఈ మాసంలో ప్రతి ఇంట్లో జరుపుకొనే మరొక ముఖ్యమైన పండుగ వరలక్ష్మీ వ్రతం. వరలక్ష్మీ అమ్మవారు చారుమతీదేవిని, ఆమె స్నేహితులను ధన కనక వస్తు వాహనాలతో అనుగ్రహించిందని, వాటి మీద ఆశతో పూజ చేసేవారు కొందరు ఉంటారు. అయితే ఆ వ్రతకథ మొదట్లోనే వారు నివసిస్తున్న కుండిన నగరం అప్పటికే స్వర్ణమయమైన గృహాలతో సుసంపన్నంగా ఉండేదనే విషయాన్ని మరచిపోతారు. **కర్మానుబంధ రూపేణ పశు పత్ని సుతాలయాః** అనే ఆర్యోక్తిని అనుసరించి, ఎంత పరమాత్ముడు అనుగ్రహించినా, మన కర్మఫలంలో లేనిది మనకు దక్కదనే విషయాన్ని గ్రహించి దక్కినదంతా పరమాత్మ ప్రసాదంగా స్వీకరించే స్వభావాన్ని అలవరచుకోవాలి. అలాగే స్వయంగా వరలక్ష్మీదేవి ప్రత్యక్షమై పూజా విధానాన్ని బోధించడానికి చారుమతిదేవి అర్హత ఎలా సంపాదించిందో ఆ వ్రతకథలోనే తెలుపబడింది. అట్టి సత్ప్రవర్తనను అలవర్చుకొన్ననాడు, పరమాత్మ అనుగ్రహం తప్పక కలుగుతుంది. ఆ అనుగ్రహాన్ని అనుభవించగలిగే యోగ్యత కూడా ఆ సత్కర్మ వలన లభిస్తుంది.

# వివేక చూడామణి

సేకరణ - రమణ ప్రసాద్

**యచ్ఛకాస్త్యనపరం పరాత్పరం। ప్రత్యగేకరసమాత్మ లక్షణమ్,**

**సత్యచిత్సుఖమనంతమవ్యయం। బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని॥** 264

ఆ పరబ్రహ్మము తన కంటె భిన్నమైనది ఏదియు లేనిదై, తానే పరము కంటెను పరమైనదై, ప్రత్యగ్రూపమై, ఏక రసమై సర్వాంతరాత్మయై, అనంతము, అవ్యయము అగు ఆ బ్రహ్మము నీవే. “నేనే పరబ్రహ్మము” అని సదా భావింపుము.

## ప్రపంచ నివారణము

**స్వాత్మన్యారోపితాశేషాభాసవస్తునిరాసతః॥**

**స్వయమేవ పరంబ్రహ్మ పూర్ణమద్వయమక్రియమ్॥** 398

తన ఆత్మ యందు ఆరోపింపబడిన సమస్త కల్పిత వస్తు సముదాయమును నిరాకరించి, పరిపూర్ణము, అద్వితీయము, అక్రియము అగు పరబ్రహ్మము తానే అగును.

**సమాహితాయాం సతి చిత్తవృత్తౌ పరాత్మని బ్రహ్మణి నిర్వికల్పే,**

**న దృశ్యతే కశ్చిదయం వికల్పః ప్రజల్పమాత్రః పరిశిష్యతే॥** 399

నిర్వికల్ప పరమాత్మయందు చిత్తము లీనమై యుండునప్పుడు వికల్పములెంత మాత్రమును కలుగవు. వికల్పము వాగాడంబరముగా ఉండిపోవును.

**అసత్కల్పో వికల్పో ఽ యం విశ్వమిత్యేక వస్తుని।**

**నిర్వికారే నిరాకారే నిర్విశేషే భిదా కుతః॥** 400

వికారశూన్యము, నిరాకారము, నిర్విశేషము (పూర్ణము) అగు ఏక వస్తువు యందు అజ్ఞాన కల్పితమగు ప్రపంచము అగు వికల్పమెటుల కలుగును?

**ద్రష్టృ దర్శన దృశ్యాది భావ శూన్యైక వస్తుని।**

**నిర్వికారే నిరాకారే, నిర్విశేషే భిదా కుతః॥** 401

ద్రష్ట, దృశ్యము, దర్శనము అను భేదములు లేనిదై నిర్వికారమై, నిరాకారమై, నిర్విశేషమైన ఏక వస్తువునందు భేదమెటుల కలుగును?

**కల్పార్ణవ ఇవాత్యంత పరిపూర్ణైక వస్తుని।**

**అద్వితీయే పరే తత్త్వే నిర్విశేషే భిదా కుతః॥** 402

నిర్వికారము, నిరాకారము, నిర్విశేషము ప్రళయకాల సముద్రముల వలె పరిపూర్ణమైన ఏక పదార్థమునందు(ఆత్మయందు) భేదమెటుల కలుగును?

**తేజసీవ తమో యత్ర ప్రలీనం భ్రాంతి కారణమ్।**

**అద్వితీయే పరే తత్త్వే నిర్విశేషే భిదా కుతః॥** 403

ప్రకాశమున్నచోట చీకటి నశించిపోవును. అట్లే భ్రాంతి పూర్వకమగు అజ్ఞానము నశించినప్పుడు, ఆ అద్వితీయము, నిర్విశేషము యైన ఆ పరతత్త్వము నందు భేదమెటుల కలుగును?

**ఏకాత్మకే పరే తత్త్వే భేదవార్తా కథం భవేత్।**

**సుషుప్తౌ సుఖమాత్రాయాం భేదఃకేనావలోకితః॥** 404

సుషుప్తి యందు పొందు సుఖమునందు భేదమెవనికైనా కనపడినదా? అట్లే ఏకాత్మకము, అద్వితీయము, అగు ఆ పర తత్త్వమునందు భేదమెటుల కలుగును?

**న హస్తి విశ్వం పరతత్త్వ బోధాత్ సదాత్మని బ్రహ్మణి నిర్వికల్పే,**

**కాలత్రయే నాప్యహిరీక్షితో గుణే హ్యంబుబిందుర్మృగతృష్ణికాయామ్॥** 405

బ్రహ్మ జ్ఞానము కలిగిన తరువాత, సత్యరూపము, నిర్వికల్ప పరబ్రహ్మము నందు విశ్వము కానరాదు. ఎటులనిన ఎవ్వడైన, ఎన్నడైన, త్రాటియందు సర్పమును, ఎండమావియందు నీటి బిందువును చూచెనా?

**మాయామాత్రమిదం ద్వైతమద్వైతం పరమార్థతః।**

**ఇతి బ్రూతే శ్రుతిస్సాక్షాత్సుషుప్తావనుభూయతే॥** 406

ద్వైతము మాయా మాత్రమైనది. ఉన్నది అద్వైతమే. సుషుప్తి యందు కలుగు అనుభవము కూడ అట్టిదే అని శ్రుతులు చెప్పుతున్నవి.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"బలిచక్రవర్తి యొక్క చరిత్రను తెలుసుకొనగోరుచున్నాను!" అన్నాడు రాముడు విశ్వామిత్రునితో. మిక్కిలి ఆనందముతో రామునికి బలిచక్రవర్తి వృత్తాంతమును ఈ విధంగా తెలియజేశారు విశ్వామిత్రులు. "బలిచక్రవర్తిని సంహరించకుండా ఆతనిపై విజయమును సాధించదలచిన మహావిష్ణువు, కశ్యప మునికి, అదితికి కుమారునిగ అవతరించాడు. పొట్టిగా వున్న ఆ బాలునికి వామనుడను నామకరణముజేసి, ఉపనయనము గావించారు. వామనుడు ఒక చేతిలో కమండలమును, వేరొక చేతిలో ఒక గొడుగును పట్టుకుని ఒకనాడు, బలిచక్రవర్తి తలపెట్టిన యాగశాలకు వెళ్ళాడు. తనను సమ్మోహనపరచిన ఆ చిరు బ్రాహ్మణ బాలుని చూసిన బలి మిక్కిలి ఆనందము చెందాడు. "ఓ బ్రాహ్మణా, అందము, తేజస్సు, నయనాకర్షణ రూపముతోనున్న మీ రాకయే నాకు కలిగిన మహాద్భాగ్యము.... మీకు నన్ను నేనే సమర్పించగోరుచున్నాను. మీకోరికను నెరవేర్చు భాగ్యమును నాకు ప్రసాదించండి" అన్నాడు వామనునితో బలి. దానికి వామనుడు, "ఓ రాజాధిరాజా! నీ యొక్క ఖ్యాతి విశ్వమంతటా కొనియాడ బడుచున్నది. అయినా, నేను కోరుచున్నది ఒక్కటే. నా పాదములతో కొలవదగు మూడు అడుగుల నేలను మాత్రము నాకు దానమిస్తే నేను సంతోషిస్తాను". అన్నాడు. "ఇట్టి అల్పమైన కోరికను తీర్చుట నాకెంతమాత్రము?" అని బదులిచ్చిన బలిచక్రవర్తివైపు చూసి, "ఓ బలీ! అవసరమునకు మించిన దానమును కోరుట బ్రాహ్మణులకు అలంకారమునివ్వదు. అది పేరాశయగును. కావున నేను అడిగినది మాత్రము ఇచ్చిన అదియే చాలును" అన్నాడు వామనుడు.

ఆ సమయమున బలియొక్క కులగురువులైన శుక్రాచార్యుల వారు, బలిచక్రవర్తిని తన చెంతకు పిలిచి, "ఓ రాజా! నాకు ఇందు ఏదో సూక్ష్మము గోచరించుచున్నది. నీ వద్దకు యాచించ వచ్చిన ఈ బ్రాహ్మణ బాలుడు వేరెవరో కాదు.....సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువే! మోసపోకు సుమా!." అని హెచ్చరించాడు.

"అవునా కులగురూ! సాక్షాత్తు నారాయణుడే నా వద్దకు వచ్చి యాచించినచో, అంతకంటే మహద్భాగ్యము నాకు వేరేముంటుంది!

నేను ఆతనికి మాట ఇచ్చితిని. ఆతడు కోరినది ఇచ్చి తీరుతాను" అన్నాడు బలి. తరువాత వామనుని పాదములను పరిశుద్ధముజేయ నిమిత్తమై కమండలమందలి జలమును ఆ బాలబ్రాహ్మణుని పాదములపై పోయుటకు యత్నించు సమయమున, శుక్రాచార్యులు, ఒక కందిరీగ రూపమును దాల్చి, కమండలము లోనికి ప్రవేశించి, దానినుండి జలము రాకుండా అడ్డుపడ్డాడు. అన్నీ తెలిసిన వామనుడు తన వ్రేలికి చుట్టబడిన దర్భపుల్లతో కమండల ద్వారమందు పొడవగా, లోపల కందిరీగ రూపములో దాగియున్న శుక్రుడు కంటిగాయముతో బయటకు వచ్చాడు.

ఈ సంఘటనను పెరియాళ్వార్, తనను యశోదగా భావించి, చిలిపి కృష్ణుని చేష్టల గొప్పదనమును వివరించిన విధమును ఈ పాసురముద్వారా తెలుసుకొందాము.....

**మిక్కిలి కీర్తివంతుడైన మహాబలి యాగమున**
**తగదీదానమని ఆ దినమున హెచ్చరించిన**
**శుక్రుని కంటిని కరమందలి దర్భచే పొడిచిన**
**చక్రధారి! శ్రీ మహావిష్ణు! ఆహా! ఆహా!**
**ఏమని వివరించగలనీదివ్యలీలామహిమను!**
**శంఖధారి! శ్రీమన్నారాయణా! ఓహో! ఓహో!**

బలిచక్రవర్తి తన భార్యయైన వింధ్యావళి మాటపై, "ఓ బ్రాహ్మణా! ఇక నీవు నీ ఇష్టప్రకారముగనే నీకు కావలసిన భూమిని కొలుచుకుని తీసుకో!" అన్నాడు వామనునితో.

వెంటనే రెప్పపాటు కాలములో వామనుడు త్రివిక్రమ రూపమును దాల్చి, భూమిని, ఆకాశమును తన రెండు పాదములతో కొలిచి, 'మూడవ అడుగును ఎచ్చట వెయ్యాల' ని బలిని ప్రశ్నించెను. అంతా తనదేయను అహంకారము వీడిన బలిచక్రవర్తి, తన శిరస్సువంచి, దానిపై వామనుని పాదమును మోపమన్నాడు.

"నీయొక్క అహమును నాకు సమర్పించి, ఈ దినమునుండి నీవు "మహాబలి"యను కీర్తిని సంపాదించుకొంటివి. పాతాళలోకమందు నీవు గొప్పగ పరిపాలించి కీర్తిని పొందెదవుగాక....నేను నీకు రక్షకునిగనుండి అనుగ్రహిస్తాను" అన్నాడు నారాయణుడు. ఆనందముప్పొంగిన హృదయముతో ఈ సంఘటనను పెరుమంగై ఆళ్వార్లు ఈ విధముగ వివరించారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ కొండ శేషంరాజుగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీకృష్ణజన్మాష్టమి పూజల ప్రారంభంలో మొదటి రోజునే శ్రీ బాబు ఆదేశంతో శేషంరాజు దంపతులు త్రయాహ్నిక పూజలకు దీక్ష తీసుకుని కలశస్థాపన చేశారు. శ్రీ బాబుకు ఆనాటి ఉదయమే బాల కృష్ణుని భావనతో కృష్ణవేణమ్మగారు తలకు నూనె అంటి, ముత్తైదువులతో హారతి యిచ్చుకున్నారు. అభ్యంగన స్నానం చేయించారు. కృష్ణవేణమ్మగారు తాము బాబుకు ఏ సేవలు సమర్పించటానికి నిశ్చయించుకున్నారో అవన్నీ జరిపితే గాని తృప్తి పడేవారు కాదు. శ్రీ బాబు "ఇవన్నీ ఎందుకమ్మా?" అంటే, తల్లి పిల్లవానితో అన్నట్లు "బాలకృష్ణుని జన్మ దినం నాడు తలంటు పోయకపోతే యశోదమ్మ మాతృహృదయం తల్లడిల్లిపోదూ? పిల్లవాని పుట్టినరోజున తలంటు పోయని తల్లి ఎక్కడైనా ఉంటుందా? ఇవన్నీ శాస్త్ర ప్రకారం జరుగవలసిన విధులు బాబూ! మీరు వీటికి అభ్యంతరం చెప్పకూడదు" అన్నారు.



ఆ మాతృ భావనకు శ్రీ బాబు కట్టుబడక తప్పలేదు. తలంటుపోసుకొని తమ అనుష్ఠానం ముగించుకొనేసరికి, ఆ బాలకృష్ణుడే గీతాచార్యుడై దివ్యబోధను అందించారు. అదే మాతృభావనతో ఆ బుల్లి కన్నయ్యకు యిష్టమైనవన్నీ వెన్నతో సహా, 27 రకాల (సప్త వింశతి) పిండి వంటలు చేసి, శ్రావణ బహుళాష్టమి రాత్రి వేళ శ్రీకృష్ణ ఆవిర్భావ సమయానికి శ్రీసద్గురు పాదపూజ జరుపుకొని, ఆ బాలకృష్ణ భగవానునికి నైవేద్యం పెట్టారు. ఆ బాలకృష్ణుడు అందించిన వెన్న ప్రసాదమును తమ భక్తి అనే కలకండతో కలుపుకొని భక్తులందరు ఆరగించి ఆనందాబ్ధిలో ఓలలాడారు.

మూడురోజులూ సద్గురు పాదపూజలు జరిగాయి. మూడవ రోజు రాత్రి వేళ భక్తులందరూ గోపగోపీమణులై, 'కన్నయ్య'తో (బుజ్జిబాబు)

"ఉట్టికొట్టే" ఆట కూడా ఆడుకున్నారు. విజయవాడలోని శేషంరాజుగారి గృహ ప్రాంగణం 'వ్రజవాడ'గా ప్రకాశించింది.

ఏ దివ్య ముహూర్తంలో శేషంరాజు దంపతులకు శ్రీకృష్ణాష్టమి పూజలను శ్రీ బాబు సన్నిధిలో తమ యింట్లో జరుపుకోవాలనే సత్సంకల్పం కలిగిందో గాని, అది వజ్ర సంకల్పమై , అదే విధానంలో యీనాటి వరకూ క్రమం తప్పక ప్రతియేటా శ్రీ కృష్ణాష్టమి పూజలు శేషంరాజుగారి కుటుంబంవారు వంశ పారంపర్య దీక్షగా నిశ్చయించుకుని, అత్యంత భక్తి శ్రద్ధలతో త్రయాహ్నిక దీక్షతో జరుపుకుంటున్నారు.

1966లో శేషంరాజుగారికి విశాఖపట్నం బదిలీ అయింది. ఆ సంవత్సరం నుండి శ్రీ కృష్ణాష్టమి పూజలు అక్కడనే వారి అధికార నివాస గృహంలో జరిగేవి. 1972లో ఆశ్రమ స్థాపన జరిగినప్పటి నుండి, వారు, వారి సంతానము ఆశ్రమంలోనే స్థిర నివాసమేర్పరచుకొని ప్రతి సంవత్సరము శ్రీకృష్ణాష్టమి పూజలు ఆశ్రమంలోనే జరుపుతున్నారు. అనితర చింతనులై తమను సేవించుకుంటున్న ఆ దంపతులను శ్రీ బాబు కంటికి రెప్పగా కాపాడుకుంటూ ఉండేవారు.

విశాఖపట్నంలో పనిచేస్తున్న రోజులలో శేషంరాజుగారు ఆఫీసు ప్రధాన అధికారి కావటం వలన ఆ ఆఫీసులో ఉద్యోగులందరి నెలసరి జీతాలకు కావలసిన మొత్తమును వారే జిల్లా ట్రెజరీ ఆఫీసు నుండి తీసుకొని వచ్చి, ఉద్యోగులకు జీతాలకు కావలసిన మొత్తమును (లక్షరూపాయలపైన మొత్తము) ట్రెజరీ నుండి తీసుకొని ఆఫీసుకు వచ్చారు. తీరా ఆఫీసుకు వచ్చి చూసుకొనే సరికి ఆ మొత్తము డబ్బు పెట్టిన సంచీ కనబడలేదు.

శేషంరాజుగారికి గుండె ఆగినంత పనైంది. దోవలో ఎక్కడా ఆగనూ లేదు. ఎవరితో మాట్లాడనూ లేదు. ఉద్యోగులందరు జీతాల కోసం వస్తే ఏమని చెప్పాలి? అంత పెద్ద మొత్తాన్ని ఎక్కడ నుంచి తెచ్చి వాళ్ళకివ్వాలి? నలుగురికీ యీ విషయం తెలిస్తే తన పరువు, మర్యాద ఏం కావాలి? అసలు ఉద్యోగానికే ముప్పు రావచ్చునే? "బ్రతికి ఉండి యీ నిందను భరించటం కంటె..." ఈ ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయి శేషంరాజుగారు ఆఫీసులోనే తల పట్టుకొని "బాబూ! బాబూ!" అంటూ కూర్చుండి పోయారు.

- సశేషం





-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# శ్రీ రమణ మహర్షి

అప్పటికి అరుణాచలంలో మూడు నెలల నుండి చుక్క వర్షం అయినా లేక ప్రజలు కటకటపడుతున్నారు. ఆ రోజు రాత్రి అవతార మూర్తి రాకకు వరుణదేవుడు తన హర్షాన్ని వర్ష రూపంతో తెలుపుకున్నాడు.

వెంకట్రామన్ గుడిలో, గుహల్లో, చెట్లకింద, ఎండలో, వానలో, చలిలో రాత్రింబవళ్ళు సంవత్సరాల తరబడి మహోగ్రమైన తపస్సులో, సమాధిలో మునిగిపోయారు. ఆ రోజులలో ఆయనను 'బ్రాహ్మణ స్వామి' అని పిలిచేవారు.



అలగమ్మ మూడు సంవత్సరాలకు కుమారుని జాడ తెలుసుకొని అరుణాచలం వచ్చి రాళ్ళు కరిగేటట్టు ఏడ్చింది. కుమారుని మనస్సు కరుగలేదు. వెంకట్రామన్ ఇలా వ్రాసి ఇచ్చాడు..."ఈశ్వరుడు వారి వారి ప్రారబ్ధాలననుసరించి జీవులను ఆడిస్తాడు. ఎవరెన్ని ప్రయత్నించినా జరుగరానిది జరగనే జరగదు. ఎవరెంత నిర్బంధించినా జరుగవలసినది జరిగేతీరుతుంది" అని. అలగమ్మ చేసేది లేక ఇంటికి వెళ్ళిపోయింది.

1907 లో మహాకవి, మంత్ర సిద్ధుడు, శ్రీ కావ్యకంఠ గణపతిముని బ్రాహ్మణ స్వామి పాదాలు పట్టుకొని "సమస్త శాస్త్రాలు మథించాను, తపస్సు చేశాను అయినా నాకు శాంతి లభించలేదు. తపస్సు అంటే ఏమిటో వివరించండి. శరణార్థిని." అని వేడుకొన్నారు.

మౌన వ్రతుడైన బ్రాహ్మణస్వామి పెదవి విప్పి మెల్లగా ఇలా అన్నారు. "నేను" ఎక్కడ పుడుతుందో చూడు, మనస్సు అక్కడ లయిస్తుంది అదే తపస్సు. అదే

జ్ఞానం. ఇట్టి ఉపదేశామృతం కథలలో,ఉపనిషత్తులలో కానరాదని, జ్ఞానానికి, తపస్సుకు రమణుడు ఇచ్చిన సరికొత్త నిర్వచనమని శ్రీ కావ్యకంఠుడు పుప్పొంగిపోయి తన గురుమూర్తికి 'భగవాన్ శ్రీ రమణ మహర్షి' అని పేరు పెట్టాడు. శ్రీ గణపతి మునికి గల వేలాది శిష్యులు శ్రీరమణుని శిష్యులయ్యారు.

అలగమ్మ కుమారునితో ఉండటానికి వచ్చేసింది. ఆమె సనాతన ఆచారవంతురాలు. శ్రీ రమణుడు ఆమె ఆచారపు పట్టుదలలన్నిటినీ వదిలించారు. 1922 మే 19న ఆమెకు అవసానకాలం సమీపించినది అని గ్రహించిన శ్రీరమణుడు తన హస్తాలను ఆమె హృదయం పైన, శిరస్సుపైన వుంచి, ఉదయం 8గంటలనుండి రాత్రి 8గంటల వరకు అలా కూర్చున్నారు. అప్పుడు చెయ్యి తీసివేసి హమ్మయ్య! అంటూ 'నా హస్తాల ద్వారా నా శక్తిని అమ్మలో ప్రవేశపెట్టాను. అమ్మ ప్రారబ్ధానికి, నా శక్తికి పెద్ద యుద్ధం జరిగింది. అమ్మ భవిష్యత్తులో అనుభవించవలసిన అనేక జన్మల ప్రారబ్ధాన్ని ఈ పరిమిత కాలం లోనే అనుభవింప చేశాను. అలా ప్రారబ్ధ సంచితాలు నిశ్శేషమయ్యాయి. అమ్మ మోక్షస్థితిని పొందింది. ఇంతటి బ్రహ్మాండమైన శక్తి పాతాన్ని గతంలో ఎవరూ చేసి ఉండలేదు. గురువు మార్గాన్ని చూపగలడు కాని మోక్షాన్ని అనుగ్రహించలేడని కొందరు వాదిస్తారు. అది నిజం కాదు." అని శ్రీరమణుడు వెంటనే "ఇక మనం భోజనం చేయవచ్చు" అని అజ్ఞాపించారు. శవం వుండగానే భోజనం చేశారు. అమ్మను కొండ పాదంలో సమాధి చేశారు. తరువాత ఈ సమాధి పైననే మాతృభూతేశ్వరాలయం నిర్మించారు. ఇదే నేటి రమణాశ్రమంగా వర్ధిల్లుతోంది.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

జూన్ 17 నుండి 23 వరకు గుండుగొలను శ్రీ కాళీవనాశ్రమం శాఖ వారు నిర్వహించిన సత్సంగ మరియు అఖండ హరేరామ నామ సంకీర్తన సప్తాహ దృశ్యములు.



శ్రీ సద్గురు పాదపూజ





భక్త సమారాధన

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No. : 37804/81
Postal Regd. No. : GTR/27/2021-2023



మే 22 న ప్రతిష్ఠాదిన సందర్భముగా జరిగిన శ్రీ కాళికాపరమేశ్వరి సహిత శ్రీ రామలింగేశ్వర స్వామివారి లీలా కళ్యాణం



మే 31 న శ్రీశుకబ్రహ్మాశ్రమం, శ్రీ కాళహస్తిలో శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వామిజీతో శ్రీ మాతాజీ

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508,
Guntur Dist., A.P.